# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి తీర ప్రాంత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రకాశవంతమైన శక్తిగా ఎదుగుతోందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **హైదరాబాద్ నగరంలోని అల్పాదాయ, మధ్యతరగతి ప్రజల కోసం లక్ష ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.**

4. **12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమానికి నమోదు ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది.**

========================

విశాఖపట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి తీర ప్రాంత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ పై నిన్న నిర్వహించిన సమీక్షలో పర్యాటక, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధిపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, కైలాసగిరిని ఆధ్యాత్మిక – పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, బీచ్ వాటర్ స్పోర్ట్స్, వినోద ప్రాజెక్టులకు పెట్టుబడులు ఆకర్షించడం, జంతు ప్రదర్శనశాలకు ఆధునీకరణ చేపట్టాలని సూచించారు. అలాగే ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధ క్షేత్రాలు, పాపికొండలు, పోలవరం ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

స్వస్థలానికి దూరంగా నివసిస్తున్నప్పటికీ తెలుగు భాష, యాస, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించేందుకు ముంబయి తెలుగు సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ముంబయిలో నిన్న నిర్వహించిన "తెలుగు సాంస్కృతిక సంబరాలు" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, బలమైన ఆర్థిక పునాదులు, సంస్కరణలతో దేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రకాశవంతమైన శక్తిగా ఎదుగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో 7.7 శాతం స్థూల దేశీయోత్పత్తి వృద్ధి, అలాగే నాలుగో త్రైమాసికంలో 7.8 శాతం నమోదు కావడం భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, ప్రజల కృషిని ప్రతిబింబిస్తున్నాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తూ, యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తూ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగాన్ని సాధికారత కల్పిస్తున్న ఈ సమయంలో సాధించిన విజయాలు, 2047 నాటికి “వికసిత్ భారత్” నిర్మాణ లక్ష్య సాధనలో మన సమిష్టి సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు.

---------------------------

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మచిలీపట్నం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో నిన్న నిర్వహించిన ప్రజాదర్బార్ లో ప్రజల నుంచి వినతులను మంత్రి స్వీకరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

అసెంబ్లీ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని హైదరాబాద్ నగరంలోని అల్పాదాయ, మధ్యతరగతి ప్రజల కోసం లక్ష ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. హైదరాబాదులోని సచివాలయంలో గృహ నిర్మాణంపై సమీక్షను ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నగరంలో లక్ష ఇళ్లకు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చామన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

---------------------------

మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జి.ఓ 77 ప్రకారమే హారిజాంటల్ రిజర్వేషన్లను అమలు చేస్తూ పూర్తిస్థాయి పారదర్శకతతో నియామక ప్రక్రియ నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, శాప్ వైస్ చైర్మన్ భరణితో కలిసి డీఎస్సీ నియామకాలకు సంబంధించి ఆయన సమగ్ర వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్ రావత్ మాట్లాడుతూ..

వాయిస్…30 సెకన్లు

---------------------------

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమానికి నమోదు ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని యోగా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ నిన్న నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో పరిశీలించారు. కార్యక్రమాల సమన్వయం కోసం వైద్యారోగ్య శాఖలో ప్రత్యేకంగా 'వార్ రూమ్' ఏర్పాటు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. రేపటి నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

------------------------

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ జరగలేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు కనిపించడం లేదన్నారు. ఈ కాలంలో ప్రభుత్వం ప్రధానంగా రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యలకే పరిమితమైందని రాంబాబు విమర్శించారు.

------------------------

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మరో మూడు రోజులు కొన్నిచోట్ల ఎండ తీవ్రత, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు ప్రభావం చూపే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా 56 మండలాల్లో తీవ్ర వడ గాల్పులు, 51 మండలాల్లో వడ గాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు. మరోవైపు పోలవరం, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, మార్కాపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

అదేవిధంగా తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అనేక ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం పేర్కొంది. నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

======================